క్లుప్తంగా

మైనార్టీలకు అండగా ప్రభుత్వం



పెనమలూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉందని ఆ పార్టీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. కానూరు సనత్‌నగర్‌లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా మైనార్టీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు చాన్‌భాషా, సీతారామయ్య, వీ బాలకృష్ణ, లతీఫ్, రెహమాన్, ఖాదర్, జాఫర్‌ఖాన్, మునాఫ్, షారుక్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



పెనమలూరు: జాతీయ కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. సుమన్ షూటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఏపీ చీఫ్ ఎస్.దుర్గారావు ఆదివారం వివరాలు వెల్లడించారు. చిలకలూరుపేటలో ఆదివారం జాతీయ కరాటే పోటీలు నిర్వహించారన్నారు. కృష్ణాజిల్లా నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న బి.లక్ష్మణ్ నాగశ్రీనివాస్, ఎండీ నిజాముద్దీన్, దేవిశంకర్, ఎండీ నియమతుల్లా, కార్తిక్‌సాయి బంగారు పతకా లు గెలిచారన్నారు. ఆరీఫ్, ఆర్.ప్రభుకిరణ్‌రెడ్డి, పి.గణేష్ వెంకటసాయి, ఎండీ యూసుఫ్‌కు రజత పతకాలు వచ్చాయి. జె.తేజస్విని, ఎస్వీ.మురళి, ధరణి దుర్గాదేవీలకు కాంస్య పతకాలు వచ్చాయని దుర్గారావు తెలిపారు.

ఉషారామాలో పరిశోధనలకు అనుమతులు



ఉంగుటూరు: జేఎన్టీయూ(కాకినాడ) ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల్లో పరిశోధన కేంద్రాలను మంజూరు చేసినట్లు ఆదివారం ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల్లో పరిశోధనలకు అనుమతులు లభించాయని పేర్కొన్నారు. తమ కళాశాలలో పీహెచ్‌డీ చేసేందుకు యువ పరిశోధకులకు అవకాశం కల్పించిన జేఎన్టీయూ కాకినాడకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి కంకిపాడులో ఇంటింటి ప్రచారం

కంకిపాడు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి కంకిపాడులో ఇంటింటి ప్రచార కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు ఆదివారం తెలిపారు. గడప గడపకూ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం జగనన్న కాలనీలో విద్యుత్ లైన్ల పనులు జరుగుతున్నందున సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈఈ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మామిడికాయల మార్కెట్, పవర్‌గ్రిడ్, గుణదల రోడ్డు, బోడపాడులో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బీజేపీ ఓటమే ధ్యేయంగా పని చేయాలి

గన్నవరం: రానున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమే ధ్యేయంగా కమ్యూనిస్టులు పని చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ మరోసారి 370 ఎంపీ సీట్లతో అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. దేశాన్ని అప్పుల్లో, ఆర్థికంగా కుంగదీసిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశం పతనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, నాయకులు ఆర్.రఘు, కే వెంకటేశ్వరరావు, ఎం.హరిబాబు, టీవీ లక్ష్మణస్వామి, జ్యోతి పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

పెనమలూరు: రెండు పోలియో చుక్కలు చిన్నారులకు వేయడం వలన వారి నిండు జీవితాన్ని కాపాడుతాయని జిల్లా వైద్యాధికారి గీతాబాయ్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె కామయ్యతోపులో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. చిన్నారులు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఎదగడానికి ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో పోలియో చుక్కల కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించామన్నారు. తల్లితండ్రులు వారి పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. దీని వలన అంగవైకల్యాన్ని నిరోధించగలుగుతామని పేర్కొన్నారు. పోలియో చుక్కల కార్యక్రమం మూడు, నాలుగు తేదీల్లో కూడా కొనసాగుతుందని తెలిపారు. పల్స్‌పోలియో స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ శిరీష, మండల వైద్యులు శ్రీనివాసరావు, రాజు, సుస్మిత, మంజుల, సాయిలలిత పాల్గొన్నారు.

94 శాతం పల్స్ పోలియో..

మండల పరిధిలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో 94 శాతం టార్గెట్ పూర్తి చేశామని మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాసరావు తెలిపారు. కాగా పెనమలూరులో సర్పంచి లింగాల భాస్కరరావు, వనుకూరులో సర్పంచి చక్క విజయ, కానూరులో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చాన్‌బాషా, గంగూరులో పార్టీ పార్లమెంట్ యువజన విభాగం అధ్యక్షుడు బంగారు నాగేంద్రబాబు, తాడిగడపలో పార్టీ నాయకుడు కటికల కృష్టోఫర్ పోలియో చుక్కలను చిన్నారులకు వేశారు.

ఉయ్యూరు: రెండు పోలియో చుక్కలు జీవితాలను కాపాడుతాయని మున్సిపల్ కమిషనర్ పీ వెంకటేశ్వరరావు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం ఉయ్యూరు పట్టణంతో పాటు, మండలంలోని 11 గ్రామాల్లో ఆదివారం జరిగింది. చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. మున్సిపాలిటీలోని 4వ వార్డులో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు పోలియో చుక్కలు వేశారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కంకిపాడు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని 35 పోలియో బూత్‌లలో నిర్వహించారు. కంకిపాడు బస్టాండులో కార్యక్రమాన్ని వైద్యాదికారులు డాక్టర్ సంతోషచంద్రిక, డాక్టర్ సుధాప్రసూజ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు వేసేలా ప్రణాళిక రూపొందించుకున్నామని తెలిపారు. ఉప్పలూరులో కార్యక్రమాన్ని సర్పంచి లాం సోనియా ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అంజు, డాక్టర్ సాయినిఖిత, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని కంకిపాడు పట్టణంలో ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు ప్రారంభించారు. బాకీ బాబు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఏఎన్ఎం శాంత, ఆశ కార్యకర్త దుర్గాభవాని సిబ్బంది పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసాదంపాడు సచివాలయం-3లో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, సచివాలయం-1లో సర్పంచి సర్నాల గంగారత్నం పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో మహమ్మారిని తరిమి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ, హెల్త్ సూపర్‌వైజర్ సాంబశివరావు, సీహెచ్‌ఓ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఆదివారం సచివాలయం-1 వద్ద చిన్నారులకు పోలియో చుక్కలను విజయవాడరూరల్ మండల మాజీ ఎంపీపీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి వేశారు. నాగిరెడ్డి మాట్లాడుతూ ఐదు ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 11 గ్రామాల్లోని కేంద్రాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు కలిసి ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలను వేయించారు.

ఉంగుటూరులో 98 శాతం నమోదు

ఉంగుటూరు: మండల పరిధిలో 98 శాతం మంది చిన్నారులకు విజయవంతంగా పోలియో చుక్కలను వేశారు. పొట్టిపాడులో ఎంపీపీ వడ్లమూడి సరోజిని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. గ్రామాల్లో అంగన్‌వాడీలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల డాక్టర్లు బి.శిరీష, సుబ్బారావు, ప్రసన్న, మనోహర్‌రెడ్డి, కరిముల్లా, ఎఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని హెల్త్ సూపర్‌వైజర్ ఎ.నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించారు. బీబీగూడెం గ్రామంలో సర్పంచ్ డి.జయలక్ష్మీ పోలియో చుక్కలు వేశారు. మాజీ సర్పంచి బసవపూర్ణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కొత్తగూడెంలో సర్పంచి టీ రాంబాబు పోలియో చుక్కలు వేశారు. ఏఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీలు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం వైస్ ఎంపీపీ చందు రమాదేవి ప్రారంభించారు. మండలంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయం, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ కూడళ్లలో పల్స్ పోలియో శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా తెలిపారు.



కామయ్యతోపులో పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

విజయవంతంగా పల్స్ పోలియో

గన్నవరం: మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో ఎంపీపీ అనగాని రవి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలియో రహిత సమాజం కోసం ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని ఎంపీపీ పిలుపునిచ్చారు. పలువురు ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రిలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అల్లాపురంలో చిన్నారులకు సర్పంచి డీ సాంబశివవెంకన్నబాబు పోలియో చుక్కలు వేశారు.



పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ సురేష్‌బాబు



రోటరీ ఆడిటోరియంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ రవి



ఉప్పలూరులో పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచి లాం సోనియా



కంకిపాడులో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు



పొట్టిపాడులో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సరోజిని

సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం

రామవరప్పాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు అన్నారు. నిడమానూరులో ఆదివారం వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, గ్రామ సర్పంచి శీలం రంగారావు అధ్యక్షతన 'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో బూత్ కమిటీల సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యచరణ రూపొందించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్న, రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలన్న సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. ఇందుకోసం మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బూత్ కమిటీలు చురుగ్గా పని చేయాలని సూచించారు. ఎంపీపీ ప్రసన్నకుమారి మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. శీలం రంగారావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో ప్రతి గడపకు బూత్ కమిటీలు, నాయకులు ప్రజా క్షేత్రంలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో గన్నవరం నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు, ఎనికేపాడు, రామవరప్పాడు సర్పంచ్‌లు పూర్ణచంద్రరావు, వరి శ్రీదేవి, ఓంకార్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ కోటేశ్వరరావు

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

కంకిపాడు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో మంత్రి చొరవతో వీధిలైట్ల అనుసంధానంకు విద్యుత్ లైన్ ఏర్పాటు, సర్పంచి ఆదర్శకుమార్ ఆర్థిక సహకారంతో వీధి లైట్లు మారేడుమాక-మానికొండ డొంకరోడ్లు మార్గంలో జరగ్గా, వీధి దీపాలను స్విచ్చాన్ చేసి రాజీవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, వైస్ ఎంపీపీ కే ప్రకాష్, సర్పంచ్‌లు జీ ఎలీషా, వీరంకి వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరిహారం అందేలా కృషి

కంకిపాడు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా కృషి చేస్తామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో అగ్ని ప్రమాద బాధితుడు పామర్తి రామయ్య కుటుంబానికి ఆదివారం రూ. 20 వేలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీ శివనాగేంద్రమ్మ, స్థానిక నాయకులు సీ సుబ్బారావు, సాంబశివరావు, బడుగు కోటయ్య, నందం శ్రీనివాసరావు, శివయ్య, పీ రామకృష్ణ, బీ కిషోర్, జీ పండు పాల్గొన్నారు.



వేల్పూరులో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జోగి రాజీవ్, స్థానిక నాయకులు

యనమలకుదురు బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జరగనున్న బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయడానికి అందరి సహకారం అవసరమని పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు అన్నారు. గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామివారి కల్యాణ మండంలో ఆదివారం గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల ఏడు నుంచి 10వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. ఎనిమిదో తేదీ రాత్రి స్వామివారి కల్యాణం సందర్భంగా గ్రామంలో ప్రభోత్సవం జరుగుతుందని అన్నారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలు దిగ్విజయం చేయాలని కోరారు. సమావేశంలో ఈఓ గంగాధరరావు, ఎస్సైలు, పలు శాఖల అధికారులు, ప్రభల నిర్వాహకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామారావు

నేడు పోరంకిలో షిర్డీ సాయిబాబా 29వ వార్షికోత్సవం

పెనమలూరు: పోరంకి శ్రీనివాస నగర్‌లో శ్రీషిర్డీ సాయిబాబా 29వ వార్షికోత్సవం నేడు నిర్వహిస్తున్నామని శ్రీషిర్డీసాయి సేవాసమితి అధ్యక్షుడు ఎం.అర్జున్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బాబావారికి సోమవారం కాగడా హారతి, మంగళస్నానం, 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేస్తామన్నారు. అలాగే పళ్లరసంతో స్నపన, విశేష అలంకరణ, విష్ణు సహస్ర నామపారాయణం, తులసీదళ పూజలు, వెండి మారేడు దళాలతో విశేష అర్చన చేస్తామని తెలిపారు. పాదుకా ఉత్సవం, భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. నలంద డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అమరావతి సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి వైద్యులు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు చక్క గోపీకృష్ణ ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లు అందించామని డాక్టర్ నాదెండ్ల వేణు, కేతినేని శైలజ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీలో పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉయ్యూరు పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన లక్ష్మికి వలంటీర్ రమ్య పింఛను అందించారు. ఏడో వార్డుకు చెందిన లబ్ధిదారు జాన్‌బెన్ని విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ ముంతాజ్ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందించారు.



బిడ్డతో వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఝాన్సీలక్ష్మి

పెనమలూరు: కానూరు సచివాలయం-2 పరిధిలో వలంటీర్ ఝాన్సీలక్ష్మి ఆదివారం నెల రోజుల బిడ్డతో లబ్ధిదారు నాగేశ్వరిదేవి ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ప్రొద్దుటూరులో పూర్వ విద్యార్థులు

కంకిపాడు: ప్రొద్దుటూరు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసించిన 2005-06 విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్నేహితులతో కలిసి గత స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 2008-09 బ్యాచ్ విద్యార్థులు కుటుంబాలతో కలుసుకున్నారు. ఆనాటి తమ మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం వజ్రాట భూపాల్‌రెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ అధ్యాపకుడు ఎస్ సతీష్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయ అధికారి హేమప్రసాద్, నాటి ఉపాధ్యాయులు సీతామహాలక్ష్మీ, గోపినాథ్, వెంకటేశ్వరరావు, హరిచరణ్, విజయలక్ష్మీ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



నున్నలో పూర్వ విద్యార్థులు

సమాజ సేవే మానవతా లక్ష్యం



గన్నవరం: సమాజ సేవే లక్ష్యంగా మానవతా సంస్థ చిత్తశుద్ధితో పని చేస్తుందని వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం మానవతా సేవా సంస్థ గన్నవరం నూతన శాఖ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పుణ్య చారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ్‌కుమార్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాలకృష్ణమూర్తి, విజయకుమార్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శాంతిరథం(మహాప్రస్థానం) వ్యాన్‌ను ప్రారంభించారు. అదేవిధంగా మానవతా సంస్థ ద్వారా గన్నవరం శాఖకు రెండు ఫ్రీజర్ బాక్సులను అందజేశారు. అనంతరం గన్నవరం శాఖ అధ్యక్షుడిగా మదుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శిగా కర్రా వరప్రసాద్, కోశాధికారిగా పొట్లూరి రామకృష్ణ, ఏడుగురు సభ్యులు, మరో 15 మంది సలహాదారులతో కార్యవర్గ సభ్యులు బాధ్యతలను స్వీకరించారు.